
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శనివారం
23 మే 2026
పేజీలు : 08



# గ్యాస్ మాఫియాపై మెరుపుదాడి

## బోడుప్పల్‌లో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ గుట్టురట్టు.. 55 సిలిండర్లు స్వాధీనం

### నివాస ప్రాంతంలోనే ప్రమాదకర గ్యాస్ వ్యాపారం





**బోడుప్పల్ మే 22 (జనంసాక్షి) :** మల్కాజిగిరి కమిషనరేట్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి బోడుప్పల్ సర్కిల్‌లో అక్రమంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమా డుతున్న గ్యాస్ మాఫియాపై టాస్క్ ఫోర్స్ అధికారులు మెరుపుదాడి నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ డి.ఎస్.పి రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో భారీగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని శ్రీ అరవింద ఎన్‌క్లేవ్ రోడ్ నెంబర్-02 ప్రాంతంలో అక్రమంగా కమర్షియల్ సిలిండర్లను రీఫిల్లింగ్ చేస్తూ వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్న వ్యక్తిని స్థానిక మేడిపల్లి పోలీసుల సహకారంతో అధికారులు పట్టుకున్నారు. దాడి సమయంలో అధికారులు మొత్తం 55 కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నివాస ప్రాంతంలో ఎటువంటి భద్రతా ప్రమాణాలు లేకుండా గ్యాస్ రీఫిల్లింగ్ నిర్వహించడం వల్ల భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ఈ అక్రమ వ్యాపారం ద్వారా ప్రభుత్వానికి భారీ ఆదాయ నష్టం కలుగుతోందని, ప్రజల ప్రాణ భద్రతను కూడా ప్రమాదంలోకి నెడుతున్నారని అధికారులు పేర్కొన్నారు. నిందితుడిపై అవసరమైన కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ దాడిలో అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ సంధ్య, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నారా ప్రభాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## దిగొచ్చిన త్రిశక్తి వెంచర్ యాజమాన్యం

- త్రిశక్తి వెంచర్ మోసాలపై 'జనంసాక్షి' వరుస కథనలు
- పక్కా ఆధారాలతో సంచలనం సృష్టించిన జనంసాక్షి
- గ్రామపంచాయతీకి 15% మార్టిగేజ్ ప్లాట్ల అప్పగింత




మెయిన్‌లోకి

## ధాన్యం అమ్మకానికి రైతుల పాట్లు

- కిలోమీటర్ల మేర ట్రాక్టర్ల క్యూ
- తెల్లవారుజాము నుంచే ధాన్యం కేంద్రం వద్ద బారులు
- మారుతి ఇండస్ట్రీస్ వద్ద రైతుల కష్టాలు: ధాన్యం అమ్ముడుపోక అవస్థలు
- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం.. రైతులకు తప్పని తిప్పలు



## పోలీస్ కళాబృందం కార్యక్రమం

**కోట్ పల్లి మే 22 (జనంసాక్షి):** కోట్ పల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోలీస్ కళాబృందం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోట్ పల్లి ఎస్ఐ శైలజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాబృందం సభ్యులు పాటలు, బుర్రకథలు, నాటికల ద్వారా సైబర్ నేరాలు, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం, మహిళల భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే డయల్ 100 కు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శైలజ మాట్లాడుతూ..... పోలీస్ శాఖ ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. నేరాల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, కళాబృందం ద్వారా చట్టాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు, మహిళలకు దిశ యాప్, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 పై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం చివరిలో ప్రజలందరూ చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని ఎస్ఐ శైలజ కోరారు. కళాబృందం ప్రదర్శనలు ఆకట్టుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## మహేష్ కుమార్ గౌడ్‌పై ఆరోపణలు మానుకోవాలి

- అవమానకర కథనాలు దిగజారుడుతనం
- డైరెక్ట్‌గా అడగాలి, సొంత స్టోరీలు చెప్పొద్దు
- బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారా?
- ఓ మీడియాపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం
- నిజమైన సమస్యలపై చర్చించాలి



**ముషీరాబాద్, మే 22 (జనంసాక్షి):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌పై ఓ మీడియా చేస్తున్న వ్యతిరేక కథనాలు, ఆరోపణలు వెంటనే మానుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించిన హనుమంత రావు మాట్లాడుతూ, ఒక పార్టీ అధ్యక్షుడిని అవమానించడం మంచిది కాదని, ఏవైనా ఆరోపణలు ఉంటే డైరెక్ట్‌గా అడగాలని, ఇలాంటి దిగజారుడు కథనాలు ఓ టీవీకి తగినవి కావని విమర్శించారు. దేశ స్వాతంత్ర్యం కోసం జైలుకెళ్లిన ఎంతోమంది నాయకులు కాంగ్రెస్‌కు చెందినవారని, అలాంటి చరిత్ర కలిగిన పార్టీపై ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మీడియాపై తమకు విశ్వాసం ఉందని స్పష్టం చేసిన హనుమంతరావు, ఇలాంటి ఆరోపణలపై మీడియా చైర్మన్ స్పందించి విచారణ చేయాలని సూచించారు. ప్రధాని లాంటి వారు కాంగ్రెస్‌కు సూచనలు ఇస్తుంటే, పనిగట్టుకుని కాంగ్రెస్ నాయకులను నిందించడం వెనక ఏ రాజకీయ శక్తులు ఉన్నాయో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ రేట్లు, డ్రగ్స్, గంజాయి వంటి నిజమైన సమస్యలపై చర్చించాలని, పనికిమాలిన ఆరోపణలు చేయొద్దని హనుమంతరావు సూచించారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిని అవమానిస్తే కాంగ్రెస్ పార్టీని అవమానించినట్లేనని, నిజమైన చిత్తశుద్ధి ఉంటే మహేష్ కుమార్ గౌడ్‌ను నేరుగా అడగాలని అన్నారు. గతంలో కూడా బీసీ నాయకులపై అగ్రకులాల వారు అసత్య ఆరోపణలు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నందుకు తెలిసి చేశారని చెప్పారు. బీసీల ఆత్మగౌరవం, కాంగ్రెస్ పార్టీ ఆత్మాభిమానాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు

### యాలాల ఎస్ఐ విఠల్ రెడ్డి



**యాలాల మే 22 (జనంసాక్షి) :** అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని యాలాల ఎస్ఐ విఠల్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని కోకట్ గ్రామ శివారులో శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ట్రాక్టర్ నెంబర్ (కే.ఎ32టిడి0822) ఎలాంటి నెంబర్ లేని ట్రాలీతో ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. అదేవిధంగా ఇసుక తరలింపుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి యాలాల పోలీస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ట్రాక్టర్ డ్రైవర్ వెంకట్ అనే వ్యక్తి పైన కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఎస్ఐ విఠల్ రెడ్డి హెచ్చరించారు.

# యాచారం పరిధిలో వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు దొంగతనం

**యాచారం,మే 22(జనం సాక్షి )** రంగారెడ్డి జిల్లా, యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గాండ్లగూడ గ్రామంలో ఒక దారుణమైన చైన్ స్నాచింగ్ ఘటన చోటుచేసుకుంది. ఇంటి ముందు కూర్చొని ఉన్న ఒక వృద్ధురాలిని మాటలతో మభ్యపెట్టి, దుండగులు ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లారు. గాండ్లగూడ గ్రామానికి చెందిన బ్యాగరీ పోచమ్మ (72) అనే వృద్ధురాలు శుక్రవారం ఉదయం తన ఇంటి ముందు కూర్చొని ఉన్నారు. ఆ సమయంలో ఒక పల్సర్ మోటార్ సైకిల్‌పై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అక్కడికి వచ్చారు. వారు బాధితురాలితో మాటలు కలిపి, ఆమె దృష్టిని మళ్లించారు. క్షణాల వ్యవధిలోనే పోచమ్మ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును బలవంతంగా తెంచుకుని, బైక్‌పై వేగంగా పారిపోయారు. బాధితురాలు గట్టిగా కేకలు వేసేలోపే దుండగులు అక్కడి నుండి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు యాచారం పోలీసులు తక్షణమే స్పందించి కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. గాండ్లగూడ మరియు పరిసర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, జంక్షన్లలో ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను



పోలీసులు తీవ్రంగా పరిశీలిస్తున్నారు. పల్సర్ బైక్ నంబర్ మరియు నిందితుల హావభావాల ఆధారంగా వారిని గుర్తించే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఈ ఘటనకు సంబంధించి అనుమానాస్పద వ్యక్తులు లేదా పల్సర్ బైక్‌పై వెళ్లిన వారి గురించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే యాచారం పోలీసులకు గానీ, లేదా డైల్ 100/112 నంబర్లకు గానీ సమాచారం అందించాలని యాచారం సిఐ నందీశ్వర్ రెడ్డి తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయి. అలాగే, గ్రామాలలోని వృద్ధులు, మహిళలు అపరిచిత వ్యక్తులతో మాట్లాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**హయత్ నగర్, మే 22 (జనం సాక్షి )** చింతలకుంట అండర్‌పాస్ రోడ్డు మరమ్మత్తు పనులు నత్తనడకన సాగుతున్న నేపథ్యం లో ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సంబంధిత అధికారు లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతలకుంట అండర్‌పాస్ వద్ద జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎల్.బి.నగర్ జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ ఈ రోహిణితో ఫోన్‌లో మాట్లాడిన ఆయన ఇప్పటికే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు నెలన్నర క్రితం తవ్విన రోడ్డు పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అండర్‌పాస్ వద్ద సగం రోడ్డు మాత్రమే పూర్తి చేసి పనులను మధ్యలో నిలిపివేయడంతో హయత్‌నగర్, విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. యూ-టర్న్ కోసం ఎల్.బి.నగర్ రింగ్ రోడ్డు వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో ప్రయాణ సమయం పెరగడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడా అధికమవుతున్నాయని తెలిపారు. ప్రతి రోజు



వేలాది మంది ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చింతలకుంట అండర్‌పాస్ రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారస నాయకులు గండికోట శ్రీనాథ్, ఛాతిరి మధుసాగర్, తదితరులు పాల్గొన్నారు.

# తప్పనిసరిగా ఆథెంటికేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి

## 24వ వార్డు కౌన్సిలర్ పి. బాలకృష్ణ రెడ్డి

**తాండూరు మే 22( జనంసాక్షి)** తాండూరు మున్సిపాలిటీ 24వ వార్డులో శుక్రవారం పెన్షన్ ఆథెంటికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ ్రా బాలకృష్ణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేయూత పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులందరూ తప్పనిసరిగా ఆథెంటికేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆథెంటికేషన్ చేయించుకోని వారికి పెన్షన్ నిలిపివేసే అవకాశం ఉందని తెలిపారు. పెన్షన్ సేవలు నిరంతరంగా కొనసాగేందుకు ప్రభుత్వం సూచించిన విధానాలను ప్రతి లబ్ధిదారు పాటించాలని కోరారు. ఆథెంటికేషన్ కోసం ఆధార్ కార్డు, పెన్షన్



పాస్‌బుక్‌తో రావాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మంచాల కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డికి సన్మానం

**ఇబ్రహీంపట్నం, మే 22(జనం సాక్షి )** మంచాల మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఎడ్మ నరేందర్ రెడ్డిని మంచాల గ్రామంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మంచాల మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గరాములు ముదిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు నరేందర్ రెడ్డికి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కావలి బుగ్గరాములు ముదిరాజ్ మాట్లాడుతూ, పార్టీ కోసం శ్రమించిన ఎడ్మ నరేందర్ రెడ్డి సేవలను గుర్తించి ఈ పదవి అప్పగించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహా రెడ్డి, మరియు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మొదటి నుండి పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులను



గుర్తించి పార్టీ మరియు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన అధిష్టానాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల గ్రామ మాజీ సర్పంచ్ ఆనంగళ్ళ యాదయ్య, మండల నాయకుడు రావుల భాష, సీనియర్ నాయకులు పంబాల బుగ్గ రాములు, మాదగోని జంగయ్య గౌడ్ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు మార లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ కేటిఆర్ నగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



**ఉప్పల్, మే 22 (జనం సాక్షి):** ఉప్పల్ డివిజన్ పరిధిలోని కే టి ఆర్ నగర్‌లో రూ.1 కోటి 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందమల్ల పరమేశ్వర్ రెడ్డి స్థానిక కాలనీ వాసులతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి కాలనీ అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ హనుమంత్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పి. నరసింహ, కాంతారావు, నగేష్, శేఖర్, బాలు, తిక్కరెడ్డి, శ్రీనివాస్, చందు, రాధ, రేణుక, పద్మ, శారద, వెంకటమ్మ, రేష్మ, రజియా, ఉపేందర్ రెడ్డి, రత్నరెడ్డి, సత్తిరెడ్డి, రఘు, అలీం, సందీప్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ జోష్ బ్లాక్ మార్కెట్ టికెట్లపై పోలీసుల ప్రత్యేక నిఘా



**ఉప్పల్ , మే 22 (జనం సాక్షి):** ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ -- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్ నేపథ్యంలో నగరంలో ఐపీఎల్ సందడి తారాస్థాయికి చేరుకుంది. అభిమానులు భారీ సంఖ్యలో టికెట్ల కోసం పోటీ పడుతుండగా, మరోవైపు బ్లాక్ మార్కెట్ టికెట్ దందా కూడా జోరుగా సాగుతున్నట్లు సమాచారం. కొంతమంది దళారులు ముందుగానే భారీ మొత్తంలో టికెట్లు కొనుగోలు చేసి, వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలుస్తోంది. సాధారణ ధరల కంటే పలుమార్లు ఎక్కువకు టికెట్లు అమ్ముతున్నారని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక సైబర్ నేరగాళ్లు కూడా రంగంలోకి దిగినట్లు పోలీసులు గుర్తించారు. మ్యాచ్ టికెట్లు పేరుతో నకిలీ యాప్‌లు, ఫేక్ వెబ్‌సైట్లు సృష్టించి ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలు, నకిలీ టికెట్ అమ్మకాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అనుమానాస్పద లింకులు, సోషల్ మీడియా పోస్టులు, నకిలీ యాప్‌ల ద్వారా టికెట్లు కొనుగోలు చేయవద్దని ప్రజలకు సూచించారు.

# ఎస్ఐఆర్ అభివృద్ధిపై మైలార్‌దేవ్‌పల్లిలో బీజేపీ కార్యకర్తల సమావేశం



**రాజేంద్రనగర్,మే22(జనంసాక్షి)** భారతీయ జనతా పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ 2వ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్ఐఆర్ డివిజన్ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ డ్రైనేజ్, తాగునీరు, మౌలిక వసతులు, కాలనీల అభివృద్ధి వంటి ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అలాగే పార్టీ బలోపేతం, బూత్ స్థాయి కార్యకర్తల సమన్వయం, రాబోయే కార్యక్రమాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అడికే రాజు, అడికే మహేందర్, బల్ల శ్రీనివాస్ యాదవ్, జి శ్రవణ్ కుమార్, గూడూరి అంజి, రామకృష్ణ, జోగు నగేష్, పి నందు, రవి కుమార్, సురేష్ యాదవ్, సాయి కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు ఆటోలను వెంటనే రద్దు చేయాలి

## కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**తాండూరు మే 22 (జనంసాక్షి)** కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులకు జీవో 60 ప్రకారం కనీస వేతనాలు 2,2500 వేలు చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు డిమాండ్ చేశారు. శుక్రవారం తాండూర్ పట్టణం మున్సిపల్ కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తాండూర్ మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు తాండూర్ మున్సిపల్ వర్కర్స్ అండ్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, చెత్త సేకరణ కోసం ప్రైవేట్ ఆటోలు పెట్టడాని వెంటనే రద్దు చేయాలన్నారు. పట్టణ ప్రజలపై చెత్త పేరుతోనే కొత్త పన్నులు వేసే విధంగా ఆలోచనను తాండూర్ మున్సిపల్ చైర్పర్సన్ కమిషనర్ వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తాండూర్ మున్సిపల్ డ్రైవర్లకు కనీస వేతనం 22,500 ఇవ్వాలని వర్కర్లకు 19500 ఇవ్వాలని డ్రైవర్లుగా గుర్తించాలని, జీవో 60 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని ప్రతి నెల ఒకటో తేదీ కార్మికులందరికీ జీతాలు చెల్లించాలన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులలో వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఒకరికి తీసుకోవాలని కొంతమందికి పెండింగ్ జీతాలు చెల్లించాలి ఈఎస్ఐపీఎఫ్ లో ఉన్నటువంటి కార్మికుల పేర్లని సవరించాలని, రెగ్యులర్ జవాన్లని నియమించాలి, కార్మికులకు పనిభారాన్ని తగ్గించాలని ఏండ్ల తరబడిగా అట్టడుగు కులాలకు చెందిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు సంబంధించిన వారు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు తాండూర్ మున్సిపాలిటీలో పనిచేస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ పట్టణాన్ని శుభ్రం చేస్తున్నారని సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాల్లో అనేక ఆర్థిక ఇబ్బందులు అవుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నదని పెరుగుతున్న ధరలకు అనుకూలంగా వేతనాలు ఇవ్వకపోవడంతో వస్తున్న వేతనాలు కూడా రెగ్యులర్ గా రాకపోగా కార్మికుల కుటుంబాల్లో అనేక ఆర్థిక ఇబ్బందులు గురవుతున్నారని దీనితో పాటు వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఉంటేనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక అధికారులు మున్సిపల్ కాంటాక్ట్ కార్మికులకు రెగ్యులర్ గా వేతనాలు చెల్లించాలని సౌకర్యాలు కల్పించాలని చట్టపరమైన సౌకర్యాలు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తాండూర్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వర్కింగ్ నరేష్, కార్యదర్శి డి వెంకటేష్ ,ఎం బలరాం, నర్సిములు ,అయిబ్, ప్రకాష్ ,ఆశప్ప, డి లక్ష్మణ్ ,జి నర్సిములు, బి వీరేశం ,కే శంకర్ , జయ ,శివకుమార్ ,ఎన్ వెంకటప్ప ,ఎం పవన్ ,టి మహేష్, ఏం చిన్న, డి శ్రీనివాస్, ఎన్ రాములు, డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బీఎంఆర్




**తాండూరు మే 22 (జనంసాక్షి)** ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించారు. శ్రీశైలంలో కొలువై ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక అభిషేక పూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రం అందజేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట కుటుంబ సభ్యులు, అనుచరులు పాల్గొన్నారు.

# మండుతున్న ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## బిఆర్ఎస్ నాయకులు మూడెడ్ల గోవర్ధన్ రెడ్డి



**యాచారం, మే 22(జనం సాక్షి )** రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా యాచారం మండల ప్రజలు ఎండల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని మండల బిఆర్ఎస్ నాయకులు మూడెడ్ల గోవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, మండుతున్న వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు స్వీయ జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు. దాహం వేయకపోయినా ప్రతి గంటకు సరిపడా మంచినీరు తాగుతూ శరీరాన్ని కాపాడుకోవాలి. శరీరంలో నీటిశాతం తగ్గకుండా నిరంతరం మజ్జిగ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం లేదా ఓఆర్ఎస్ మిశ్రమాన్ని తీసుకోవాలి. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకపోవడం మంచిది. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తలకు గొడుగు, టోపీ లేదా తెల్లటి కాటన్ రుమాలు ధరించాలి. లేత రంగు నూలు దుస్తులకే ప్రాధాన్యత ఇవ్వాలి. వృద్ధులు, గర్భిణీ స్త్రీలు మరియు చిన్న పిల్లల విషయంలో కుటుంబ సభ్యులు మరింత శ్రద్ధ వహించాలి. వడదెబ్బకు గురై స్వల్ప అస్వస్థతగా అనిపించినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని మూడెడ్ల గోవర్ధన్ రెడ్డి ప్రజలను కోరారు.

# కనీస వేతనాల పెంపు కాదు తగ్గింపు వేతనాల అమలులో మోసం

## బిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య



**వికారాబాద్ జిల్లా బ్యూరో మే 22 (జనం సాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్కువగా కనీస వేతనాలు పెంచి, తెలంగాణలో, వివిధ రంగాల్లో పని చేస్తున్న, కోటి,12 లక్షల మంది సంఘటిత, అసంఘటిత, రంగ కార్మికుల్ని తీవ్రంగా మోసం చేశారని జిల్లా అధ్యక్షులు కృష్ణయ్య విమర్శించారు. వెంటనేపెరుగుతున్న ధరలకనుగునగా, ద్రవోల్బవణాన్నీ దృష్టి లో పెట్టుకొని, కనీస వేతనం, నెలకు,రూ, 29,500 లకు పెంచాలని, డిమాండ్ చేశారు. కార్మిక వర్గనికి ఉద్యోగులకు సమానంగా పి ఆర్ సి లో భాగస్వాములను చేసి, కార్మికులకు కూడ పిఆర్సి గత ప్రభుత్వం లాగ వర్తింప చేయాలని, డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీగా ఉన్న రోజుల్లో కార్మిక వర్గానికి కానిస వేతనాలు నేలకు 28,500ఇవ్వాలని డిమాండ్ చేసిన సంగతి మర్చిపోయారా? అనికృష్ణయ్యప్రశ్నించారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి పరిశ్రమాల యాజమాన్యాలకు అమ్ముడు పోయారా అని కృష్ణయ్య ప్రశ్నించారు. గత 15 సంవత్సరాల్లో నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, ఇంటి కిరాయిలు పిల్లల స్కూలు కాలేజీ, ఫీజులు పెట్రోల్ డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని కూరగాయల ధరలు బట్టల ధరలు కూడా పెరిగాయని రవాణా ఖర్చులు, వైద్యం ఖర్చులు గూడా విపరీతంగా పెరిగాయని వీటిని దృష్టి లో పెట్టుకొని కనీస వేతనాలు కూడా,29,500వేలకు తగ్గకుండా పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్మికులకు ఈ ఎస్ ఐ పి ఎఫ్ ఇన్సూరెన్స్ లాంటి సంక్షేమ పథకాలను కచ్చేచితంగా అమలు చేయాలని, కృష్ణయ్య డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వం కార్మిక వర్గానికి దేశంలో ఎక్కడ లేని విధంగా, ప్రభుత్వ ఉద్యోగులకు, సమానంగా 30 శాతం పి.ఆర్.సి. అమలు చేశారనీ. స్థానికులకే,80 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాబోవు టి ఆర్ సి లో45 శాతం ఉద్యోగులకు,కార్మికు వర్తింప చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేదంటే యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాటాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. కనీస వేతనాలు, రూ,28,500 తగ్గకుండా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెంచాలని, డిమాండ్ చేశారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో
# యువజన, క్రీడలు పర్యాటక శాఖల ప్రత్యేక కార్యక్రమాలు

- సమ్మర్ క్యాంప్ మైదానాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు
- కీసరగుట్టలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహణ



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 22 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా యువజన మరియు క్రీడల శాఖ, పర్యాటక శాఖల వారోత్సవ కార్యక్రమాలు జిల్లాలో కొనసాగుతున్నాయని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి, జిల్లా పర్యాటక శాఖ ఇన్‌చార్జి ఐ. విజయ కుమారి తెలిపారు. మే 18 నుంచి 23 వరకు యువజన, క్రీడలు మరియు పర్యాటక శాఖల ప్రత్యేక వారాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా గురువారం జిల్లాలో నిర్వహిస్తున్న 24 సమ్మర్ క్యాంప్ మైదానాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. క్యాంప్ ఇన్‌చార్జులు, క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని మైదానాలను శుభ్రపరిచారు. విద్యార్థులు, యువతలో క్రీడాస్ఫూర్తితో పాటు పరిశుభ్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి శిక్షణా శిబిరాల్లో పాల్గొంటున్న యువత ఆరోగ్యవంతమైన వాతావరణంలో శిక్షణ పొందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అలాగే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రమైన కీసరగుట్ట ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టూరిస్ట్ పోలీసులు, ఆలయ సిబ్బంది, యువత పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ శాఖలు ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు సామాజిక బాధ్యతలను ప్రజల్లో పెంపొందించడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

# పాఠశాలశుద్ధి చేసే స్కావంజర్‌కు నెలలు గడుస్తున్న జీతాలు చెలించడం లేదు

- టెక్నికల్ ప్రాబ్లమ్ వల్ల బ్యాంక్ కూ రావడం లేదని చెప్పుకోస్తున్న ఉపాధ్యాయులు.
- ఉపాధ్యాయుల ఖాతాలో స్కావంజర్ డబ్బులు జమ.
- పట్టించుకోని స్కూల్ చైర్మన్ ఉపాధ్యాయుడు.

**జిల్లెడు చౌదరి గూడ (జనం సాక్షి)** వీరన్న పేట ప్రాథమిక పాఠశాల శుద్ధి చేసే స్కావంజర్ యాదయ్య కూ గత ఎనిమిది నెలలుగా జీతాలు చెల్లించడం లేదు తన జీవనం గడవాలంటే కష్టంగా మారింది. ఇన్ని నెలలుగా డబ్బులు ఇవ్వకుండా ఉంటే ఎలా అని ఉపాధ్యాయులనీ ప్రశ్నించగా బ్యాంకులో టెక్నికల్ ప్రాబ్లం వల్ల పాఠశాల అకౌంట్ కు డబ్బులు జమ కావడం లేదని ప్రధానోపాధ్యాయుడు వీరేష్ చెప్తున్నారని పేర్కొన్నారు. ఎంఈఓ కిరణ్ కుమార్ రెడ్డి, డీఈవో, అధికారులు పట్టించుకోని త్వరగా మాకు స్కావంజర్ పెండింగ్ లో ఉన్న జీతాలు చెల్లించాలని యాదయ్య కోరారు.



## అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు



**నిజాంపేట్ మే 22( జనం సాక్షి)** దుండిగల్ సర్కిల్ 59 పరిధిలో అనుమతులు లేని నిర్మాణాలు పై దుండిగల్ టౌన్ ప్లానింగ్ అధికారుల శుక్రవారం కూల్చివేతల చేపట్టారు. ప్రధానంగా డి పోచంపల్లి లోని సర్వే నెం.168 నందు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న 3 నిర్మాణాలను అధికారులు డిమాలిష్ చేశారు. అదేవిధంగా గాగిల్లాపూర్ గ్రామంలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ బలోపేతానికి సంస్థాగత ఎన్నికలు కీలకం



**అల్వాల్, మే 22 (జనంసాక్షి):** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) బలోపేతానికి సంస్థాగత ఎన్నికలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు అత్యంత కీలకమని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని భూదేవి నగర్, ఖానాజీ గూడ డివిజన్‌లలో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డివిజన్ స్థాయిలో సమర్థవంతమైన కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికీ పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లేలా సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి అర్హుల ఓటు హక్కులను కాపాడాలని సూచించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెస్తున్నామని స్పష్టం చేసిన ఎమ్మెల్యే.. సాధారణ సభ్యత్వ రుసుము రూ.10, క్రియాశీలక సభ్యత్వం రూ.50 గా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ గౌడ్, తోట నరేందర్ రెడ్డి, రావుల అంజయ్య, జేపీసీ వెంకన్న తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## అందరూ పాలు తాగి పెరిగారు..
# నేను మాత్రం కల్లు తాగి పెరిగాను

### ఎక్స్పీరియమ్ అధినేత రాందేవ్ రావు



**శంకర్ పల్లి, మే22(జనంసాక్షి)** ప్రకృతి ప్రేమికుడు ఎక్స్పీరియమ్ ఎకో పార్క్ అధినేత రాందేవ్ రావు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన తాటికల్లు గురించి మాట్లాడుతూ... తాటి చెట్టు అంటే కేవలం కల్లు గీయడానికే పరిమితం కాదు.అది కనకవర్షం కురిపించే కల్ప వృక్షం అని రాందేవ్ రావు అన్నారు.చిన్నప్పటి నుండి తాటికల్లు కల్లు మీద అభిమానం పెంచుకున్నానని అందరూ పాలు తాగి పెరిగితే నేను మాత్రం కల్లు తాగి పెరిగానని అన్నారు.ప్రస్తుతం ఉన్న కల్లు నిబంధనలు చాలా కఠినంగా ఉన్నాయి. వాటిని సరళీకరించాలి తాటికల్లును నీరా,బెల్లం, తేనె, చాక్లెట్లుగా ప్రాసెస్ చేసే యూనిట్లు గా పెట్టాలని.కర్ణాటక తరహాలో టాడీ బార్లు కర్ణాటకలో లాగా తెలంగాణలో కూడా లీగల్‌గా “టాడీ బార్లు” ఏర్పాటు చేయాలని కోరారు. నాదృష్టిలో కేవలం కల్లుగా కాకుండా నీరా,బెల్లం, వినెగర్, సోప్ లాంటి 20 పైగా ఉత్పత్తులు చేయొచ్చు గీత కార్మికులకు లాభం ప్రాసెసింగ్ యూనిట్లు వస్తే గౌడ కులస్తుల ఆదాయం 3-4 రెట్లు పెరుగుతుందని ఎక్స్పీరియం లాంటి పార్కుల్లో “కల్లు ఎక్స్పీరియన్స్” టూరిస్టులకు చూపించవచ్చని తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో కల్తీ కల్లు తాగి 15 మంది హాస్పిటల్ పాలయ్యారు, ఒకరి పరిస్థితి విషమం. రాష్ట్రవ్యాప్తంగా 1000 లీటర్ల కల్తీ కల్లు సీజ్ చేశారు.ఈ నేపథ్యంలో రాందేవ్ రావు స్వచ్ఛమైన కల్లు,నీరా ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. కల్లును నిషేధించడం కాదు,కల్తీని అరికట్టాలి. లీగల్ చేసి, క్వాలిటీ కంట్రోల్ పెడితే గీత కార్మికులకు మేలు, ప్రజల ఆరోగ్యానికి చాలా మంచిదని అన్నారు. కల్లును కేవలం మత్తు పానీయంగా చూడకుండా వ్యవసాయ,ఆరోగ్య, టూరిజం ఉత్పత్తిగా చూడాలని కోరారు. కర్ణాటక మోడల్‌లో టాడీ బార్లు, ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.టాడీ మ్యూజికల్ ఫెస్టివల్ నిర్వహించడం ద్వారా తెలంగాణ సాంప్రదాయం,గౌడ వృత్తిలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరికి సమన్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

# నిమ్స్‌లో 2వేల కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సల ఘనత నిమ్స్ వైద్యులదే

### డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ నగరి బీరప్ప



**ఖైరతాబాద్, మే 22 (జనం సాక్షి ) :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) యూరాలజీ విభాగం రూ. 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేసి కీలక మైలురాయి సాధించింది.1989 లో తొలి ట్రాన్స్‌ప్లాంట్‌తో ప్రారంభమైన ఈ ప్రయాణంలో, గత 3 సంవత్సరాల 4 నెలల్లోనే ఐదు వందల శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. నిమ్స్ ప్రస్తుతం దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యధిక కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్న సంస్థలలో ఒకటిగా నిలిచింది. బహుళ రక్తనాళాల కిడ్నీ మార్పిడి, చిన్నారుల ట్రాన్స్‌ప్లాం ట్లు, రీ-ట్రాన్స్‌ప్లాంట్లు వంటి క్లిష్ట శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించింది. గత సంవత్స రంలో దక్షిణ భారత ప్రభుత్వ ఆసుపత్రుల్లో తొలి రోబోటిక్ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను కూడా నిమ్స్ నిర్వహించింది.ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప మాట్లాడుతూ రెండు వేల మందిలో సుమారు 1900 మందికి ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి ద్వారా ఉచితంగా చికిత్స అందించారు. ఈ విజయానికి యూరాలజీ విభాగాధిపతి రాహుల్ దేవరాజ్ నేతృత్వంలోని వైద్య బృందం డాక్టర్లు సీనియర్ ప్రొఫెసర్ రాంరెడ్డి, విద్యాసాగర్, రామచం ద్రయ్య, జి.వి.చరణ్ కుమార్, రఘువీర్, ఎస్.ఎస్. ధీరజ్, విజయ్, ఐ.రాకేష్ కుమార్, జి.అభిషేక్, అనుపమ, మధుసూదన్, వేద ప్రకాశ్, నిశాంత్, టాగ్రే, సుజన్ బాబు, వెంకట సాయి సుదీప్త, సంజ య్, రోహిత్, సోమేష్ సమిష్టిగా సహకారం అందిం చారు. అలాగే అనస్థీషియా, నెఫ్రాలజీ, రేడియాల జీ, పాథాలజీ, క్లినికల్ ఫార్మకాలజీ విభాగాలు, నర్సింగ్ సిబ్బంది సేవలు ఈ విజయానికి ఎంతో దోహదపడ్డాయన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 12వ మహాసభలను జయప్రదం చేయండి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్



**జనంసాక్షి ఫరూఖ్ నగర్** జూన్ 13, 14 తేదీలలో షాద్నగర్‌లో జరగనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 12వ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరు జగన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా షాద్నగర్ పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశం డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్ మాట్లాడుతూ జిల్లాలో రియల్ ఎస్టేట్ పేరుతో పేదల భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు దున్నుతున్న భూములకు హక్కులు కల్పించాలని, ఇల్లు లేని పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి 14 రకాల నిత్యావసర వస్తువులను చౌక దుకాణాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రజలపై భారాలు మోపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు తీర్చే దిశగా పనిచేయాలని, పెంచిన పెట్రోల్, డీజిల్ మరియు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, దున్నేవానికి భూమి ఇవ్వాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఆసరా, వితంతు, వికలాంగుల పెన్షన్లు పెంచాలని, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి కార్మికుల కోసం ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత దగ్గరగా పనిచేయడానికి ఈ జిల్లా మహాసభలను షాద్నగర్ ప్రాంతంలో నిర్వహిస్తున్నామని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అంజయ్య, ఉపాధ్యక్షులు సిహెచ్ జంగయ్య, కాకి రమేష్, సహాయ కార్యదర్శులు కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## తరుగు-తేమ పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలి: వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి




**హయత్ నగర్, మే 22 (జనం సాక్షి)** హయత్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న తీవ్ర జాప్యం, రైతులకు అవసరమైన మౌలిక వసతుల లేమి, ‘తరుగు-తేమ’ పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టి యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు చేపట్టాలని హయత్‌నగర్ మండల తహసీల్దార్ కి భారతీయ జనతా పార్టీ తరఫున వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి హాజరై, మాట్లాడుతూ రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ‘తరుగు-తేమ’ పేరుతో రైతులను దోచుకోవడం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి, వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బండారి భాస్కర్, హయత్ నగర్ ప్రభారీ కొత్త రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు కుంట్లూర్ వెంకటేష్ గౌడ్, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు హరీష్ రెడ్డి, వనస్థలిపురం అధ్యక్షులు కటకం క్రాంతి, మహిళా నాయకులు, ఇతర నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రూ.1000 కోట్ల ప్రభుత్వ భూముల వ్యవహారంలో ఎమ్మెల్యే మౌనం ఎందుకు?

## భాజపా ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్,మే22(జనంసాక్షి)** శంషాబాద్ మండలంలో రూ.1000 కోట్ల విలువైన ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయని, ఇంత పెద్ద వ్యవహారం జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మౌనం ఎందుకు వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్లు 172 నుంచి 180 వరకు ఉన్న ప్రభుత్వ భూములతో పాటు, సర్వే నంబర్ 626/1 పరిధిలోని వివాదాస్పద భూములపై తహసీల్దార్ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌పై తీవ్ర అనుమానాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అధికారులు నిర్ణయాలు తీసుకోవడం వెనుక పెద్దల అండదండలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఇప్పటికే 94 ఎకరాల భూమి ప్రైవేట్ వ్యక్తులకు బదలాయించారని, మరో 176 ఎకరాల భూమిని కూడా అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంలో రాజకీయ ప్రమేయం లేకుండా అధికారులు ఇంత ధైర్యంగా వ్యవహరించలేరన్నారు. ఇదే సమయంలో తహసీల్దార్ మాత్రం కోర్టు ఆదేశాలు, అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగానే ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు వివరణ ఇచ్చినట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకున్నానని, ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణ జరుగుతోందని సమాచారం వస్తోందని, కేవలం దిగువ స్థాయి అధికారులను మాత్రమే బాధ్యులను చేయకుండా అసలు సూత్రధారులను బయటపెట్టాలని తోకల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. వివాదాస్పద ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, అవసరమైతే సీబీఐ లేదా ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపించాలని శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు.

# అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులను చేర్పించొద్దు

## పీడీఎస్యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్



**చేవెళ్ల, మే 22 (జనంసాక్షి)** ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలల్లో అడ్మిషన్లు చేయొద్దని పీడీఎస్యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేశ్ స్పష్టం చేశారు. శుక్రవారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ గుర్తింపులేని పాఠశాలలో అడ్మిషన్లు చేస్తే విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించే ముందు ప్రభుత్వ అనుమతులు, బస్సుల పర్మిషన్లు తప్పనిసరిగా పరిశీలించకనే నిర్ణయం తీసుకోవాలన్నారు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయా లేవా చూసి తెలుసుకోవాల్సిన భాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. చిన్న పిల్లలకు చదువు చెప్పడానికి వ్యాపార ఆలోచనలతో ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు 40 వేల నుంచి 60 వేల వరకు ఫీజులు తీసుకుంటూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని చెప్పారు.

# బకారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా సంగపాక వెంకట్





**ముషీరాబాద్, మే 22 (జనం సాక్షి):** ముషీరాబాద్ నియోజకవర్గంలోని బకారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా సంగపాక వెంకట్ నియమితులయ్యారు ఈ సందర్భంగా ఆయన మర్యాదపూర్వకంగా రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ను కలిసి తనకు ఈ బాధ్యతను కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంగపాక వెంకట్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ, హైదరాబాద్ జిల్లా ఎన్ఎస్‌యూఐ జనరల్ సెక్రటరీగా, అనంతరం ముషీరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికృషి చేసినట్లు తెలిపారు. పార్టీ తన సేవలను గుర్తించి బకారం డివిజన్ అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించడం గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఈ నియామకానికి సహకరించిన మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్ సీనియర్ నాయకులు జాఫేర్, కృష్ణ, వరప్రసాద్, వంశీ పలువురునాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో కవాడిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా డి రమేష్, బాపూజీ నగర్ డివిజన్ అధ్యక్షునిగా సల్లనరేంద్రబాబు తోపాటుగా వివిధ డివిజన్ల లో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులనుపలువురు నాయకులు కార్యకర్తలు కలిసి ఘనంగాసన్మానించారు.

# వాటర్‌వర్క్స్‌లో విధులు నిర్వాహించే

## కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ




**ముషీరాబాద్, మే 22 (జనం సాక్షి):** వాటర్ వర్క్స్ లో విధులు నిర్వహించే ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని హెచ్ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ బి ఆర్ టి యు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్ లింగం పల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హెచ్ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశము నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కార్మికులకు నేల 1 వ తేదీ న జీతాలు ఇవ్వాలన్నారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి బోర్డ్ నుండి నెరుగా జీతాలు చెల్లించాలన్నారు. కార్మికులందరికి రేయిన్ కోట్ లు, కాప్స్, సివరేజ్ కార్మికులకు పని ముట్లు, మీటర్ రీడర్స్ ని అవుట్ సోర్సింగ్ కిందికి మార్చి కేటగిరి 2 లోకి మార్చి ఉద్యోగ భద్రత ఇప్పించాలన్నారు. తోటి కార్మికులకు జీవో 60 అమలు చేయాలన్నారు. వెంటనే పిఆర్సి ఇచ్చి అమలు చేయాలన్నారు. సివరేజీ కార్మికులకు గత సీఎం కేసీఆర్ ఇచ్చిన మే డే కానుకను ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జలమండలి కార్యకర్తల సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందిందని తేలిపారు. గత 2 సంవత్సరాలుగా ఇబ్బందులకు ఖాళీ పోస్టులు నింపకుండా ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు.

# డిమాండ్ల సాధన కోసం నిరావధిక సమ్మె చేస్తున్న ఐకెపి వివోఏలు

- కేనీస వేతనం రూ.20,000 అమలు చేయాలి
- సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఈనెల 18 నుండి విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టారు



**బొంరాస్ పేట, మే 22 (జనం సాక్షి):** రాష్ట్రంలోని ఐకెపి విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వివోఏ) తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18 నుండి నిరావధిక సమ్మె చేపట్టారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న నిరావధిక సమ్మె శుక్రవారం నాటికి 5వ రోజుకు చేరింది. శుక్రవారం ఐకెపి వివోఏలు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకన్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. డిమాండ్స్ ఇవే..వివోఏల కనీస గౌరవ వేతనం రూ.20,000 అందించాలి. హెచ్.ఆర్ పాలసీ అమలు చేయాలి. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. సీనియర్ వివోఏలను సీసీలుగా గుర్తించాలి. జీవో 58ను సవరణ చేయాలి. వివోఏలకు సాధారణ ఆరోగ్య భీమా సౌకర్యం రూ.20 లక్షలు కల్పించాలి. వివోఏలకు ట్యాబ్ సౌకర్యం కల్పించాలి. పని భారం తగ్గించాలి. సీనియర్ వివోఏలను గుర్తించి సీసీలుగా పదోన్నతి కల్పించాలి. చాలా ఏళ్లుగా చాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వము తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలి. రాంచంద్రయ్య సీనియర్ వివోఏ: వివోఏలకు కనీస వేతనం రూ.20,000 అందించాలి. రూ.20 లక్షల బీమా వర్తింప చేయాలి. మమ్మల్ని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. సురేందర్ రెడ్డి మండల కోశాధికారి : ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న వివోఏల సమస్యలను పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వము స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు నిరవధిక సమ్మె కొనసాగుతోంది.

# రైతన్నలకు బాసటగా నిలుస్తున్న మోడీ సర్కారు

- కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై బిజెపిలో చేరికలు
- మండల అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్ సాగర్



**బొంరాస్ పేట, మే 22 ( జనం సాక్షి):** రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని మోడీ సర్కారు కీలక నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమని మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్ సాగర్ అన్నారు. మండల పరిధిలోని దుప్చర్ల గ్రామంలోని 189వ బూత్ కు చెందిన పలువురు యువకులు మోడీ సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంచుతూ రైతులకు ఊరనిచ్చిందని, 14 రకాల ఖరీఫ్ పంటలకు మద్దతు ధర పెంపు ద్వారా రైతుల ఆదాయం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేయడం రైతులకు ప్రయోజనకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాబయ్య నాయుడు, సీనియర్ నాయకులు ఉప్పు జగదీశ్వర్, శ్రీనివాస్, అనిల్ నాయక్ ,సుధాకర్ నాయక్ ,ప్రకాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సురంగల్‌లో కౌన్సిలర్ కర్రోళ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో ఆధార్ డ్రైవ్-అడ్రస్ మార్పులు సహా అన్ని సేవలు



**మొయినాబాద్, మే 22, జనంసాక్షి:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు సురంగల్‌లో శుక్రవారం కౌన్సిలర్ కర్రోళ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధార్ డ్రైవ్ నిర్వహించారు. ఎందుకు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో చిన్నపిల్లలు, వృద్ధులకు నూతన ఆధార్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ సెంటర్లు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. రవాణా సౌకర్యం లేకపోవడం, వేసవి కాలంలో వడదెబ్బకు భయపడి చిన్న పిల్లలను ఎత్తుకొని దూరం వెళ్లలేని పరిస్థితిని గ్రహించిన కౌన్సిలర్ కర్రోళ్ల శ్రీధర్, ఆధార్ సెంటర్ నిర్వాహకులతో మాట్లాడి గ్రామంలోనే ఈ డ్రైవ్ ఏర్పాటు చేశారు. గ్రామంలోని పలువురు వృద్ధులు గతంలో ఆంధ్రప్రదేశ్ అడ్రస్‌తో ఉన్న ఆధార్ కార్డులను తెలంగాణ అడ్రస్‌కు మార్పు చేయించుకున్నారు. అదేవిధంగా ఇంటి నంబర్, వీధి పేరు తప్పుగా ఉన్నవారు కూడా అడ్రస్ కరెక్షన్ చేయించుకున్నారు. కొత్త ఎన్రోల్మెంట్ నూతనంగా జన్మించిన చిన్న పిల్లలకు కొత్త ఆధార్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించారు.